



సాక్షి ఎడిషన్, బ్యూరో ఇన్‌చార్జిలు ముజఫర్, బి.అనిల్, మేనేజర్ శ్రీనివాస్‌కు సూచనలు ఇస్తున్న గెస్ట్ ఎడిటర్ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వనిత.. అన్నింటా ఘనత

'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

- ఉమెన్స్‌డే కథనాలను పరిశీలించి ఫైనల్ చేసిన ఏఎస్పీ
- కథనాల పరిశీలన.. ఎంపికపై పలు సూచనలు
- పత్రిక సిబ్బంది కృషి అభినందనీయమన్న ఐపీఎస్



ఆడపిల్ల పుట్టిందంటే భయపడే రోజులు పోయాయి. ఇప్పుడు ఆడపిల్లను మహాలక్ష్మిగా కొలుస్తున్నారు. ఊర్లో.. అమ్మాయి పుడితే లక్ష్మీ వచ్చిందంటున్నారు. ఆమె ఒక తల్లి.. కూతురు.. సోదరి.. భార్య.. వీటన్నింటికీ మించి పోరాట యోధురాలు. ఆమె పుట్టుక ఆనందం. ఆమె ఓపికకు వందనం. ఆమె లేనిదే జననం లేదు. ఆమె లేనిదే జీవితం లేదు.. ఈ ప్రపంచానికి మనుగడే లేదు. అన్నింటా ఆమే.. అదే ఇప్పుడు ఆమె లక్ష్యం. చదువులో అగ్రస్థానంలో నిలుస్తూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ఆవకాయ పెట్టడం నుంచి యుద్ధ విమానాలు నడిపే వరకు అన్నింటా నారీ శక్తి కనిపిస్తోంది. కుటుంబానికి తోడుగా నిలుస్తూ.. కష్టాల్లో ఉన్న బతుకుబండిని లాగుతోంది. ఆమె ఆకాశంలో సగం కాదు.. ఇప్పుడు ఆమే ఆకాశం. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనాలు.

పత్రికా సిబ్బంది శ్రమ తెలిసింది

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా గెస్ట్ ఎడిటర్‌గా కరీంనగర్ సాక్షి యూనిట్ కార్యాలయానికి రావడం సంతోషంగా ఉంది. మనం ఉదయం చదివే దినపత్రికల కోసం 24 గంటలపాటు ఎన్నివ్యవస్థలు పనిచేస్తాయన్న విషయం ఈ రోజు ప్రత్యక్షంగా చూసే వీలుకలిగింది. వార్తల ఎడిటింగ్, ప్రాధాన్యం, పేజీనేషన్, ప్రాసెసింగ్, ప్రింటింగ్ తదితర అంశాలపై సిబ్బంది పడుతున్న శ్రమ వెలకట్టలేనిది. ఈరోజు స్వయంగా వార్తలను ఎంపిక చేయడం, ఎడిటింగ్ చేయడం ప్రత్యేక అనుభూతి కలిగించింది. ఈ అవకాశం ఇచ్చిన సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు. మరోసారి సాక్షి పాఠకులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

– శేషాద్రినిరెడ్డి, ఏఎస్పీ, వేములవాడ

ఉమ్మడి జిల్లాలోని పలువురు మహిళలు ఇంటా, బయట, ఆఫీసుల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' సర్వే నిర్వహించగా.. సుమారు 100 మంది వెల్లడించిన అభిప్రాయాలు ఇలా..

1 మీ ఇంట్లో ఆడ–మగ వివక్ష ఉందా?
- ఉంది 02
- లేదు 91
- చెప్పలేను 07

2 పనిచేస్తున్న కళాశాల, పని ప్రదేశంలో వివక్ష ఎదుర్కొంటున్నారా?
- అవును 04
- లేదు 78
- చెప్పలేను 18

3 మీరు ఎక్కువగా ఇబ్బంది పడుతున్న ప్రదేశం?
- బస్టాప్ 33
- కళాశాల/ఆఫీసు 08
- సెల్‌ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లు 59

4 మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న వారిలో అత్యధికులు ఎవరు?
- తెలియని వారు 14
- తెలిసిన వారే 27
- చెప్పలేను 59

5 ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ రీత్యా మహిళగా ఇబ్బందులు తలెత్తుతున్నాయా?
- అవును 27
- లేదు 47
- చెప్పలేను 26

అమ్మ ప్రోత్సాహంతో సహన ఐఏఎస్



తల్లి గీతతో కూతురు సహన

సప్తగిరికాలనీ(కరీంనగర్): సివిల్స్ కొట్టాలన్న కూతురు లక్ష్యానికి వెన్నంటే నిలిచింది ఆ తల్లి.. ఒకసారి ఫెయిలైనా.. రెండోసారి సాధించకున్నా.. సరే అమ్మా అధైర్యపడకూ అంటూ వెన్ను తట్టింది. నువ్వు సాధించగలవు అంటూ ప్రోత్సహించింది. నాలుగోసారి ప్రయత్నంలో ఆ కూతురు ఐఏఎస్ సాధించగా.. ఆ సక్సెస్‌లో తన తల్లి కీలకమంటోందా కూతురు. కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక సహన 2023 బ్యాచ్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైంది. తన తల్లి గీత ఇచ్చిన స్ఫూర్తే ఇందుకు కారణమని చెబుతోంది. సహన హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఏడాదిపాటు ఢిల్లీలో యూపీఎస్సీ కోచింగ్ తీసుకుంది. తరువాత స్థానికంగానే సివిల్స్‌కు సన్నద్ధమైంది. నాలుగో ప్రయత్నంలో తన లక్ష్యాన్ని సాధించింది. 739వ ర్యాంకు సాధించి ప్రస్తుతం శిక్షణలో ఉంది.

ఆడబిడ్డకు అండగా 'మా ఊరి మహాలక్ష్మి'



వధువుకు కన్యాదాన కానుక

గంగాధర(చొప్పదండి): కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే భ్రూణహత్యలు. పెళ్లికెదిగిన ఆడబిడ్డ భారమవుతుందని తల్లిదండ్రుల ఆవేదనలు. ఊరంతా చందాలు వేసుకొని ఓ ఆడబిడ్డ పెళ్లి చేసిన సంఘటన.. ఓ యువకుడిని ఆలోచింపజేశాయి. మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ ఏర్పాటుకు పునాది వేశాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయిపల్లికి చెందిన రేండ్ల శ్రీనివాస్–పద్మ దంపతులు తమ గ్రామంలోని ఆడపిల్లలకు అండగా నిలిచేందుకు ఏడేళ్ల క్రితం మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. గ్రామంలో జన్మించిన ప్రతీ ఆడ బిడ్డ పేరుమీద ఫౌండేషన్ తరఫున రూ.5,116, తల్లిదండ్రుల నుంచి రూ.5,000 సేకరించి సుకన్య సమృద్ధి యోజనలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారు. గ్రామంలో ఇప్పటివరకు 54 మంది ఆడపిల్లల పేరిట డిపాజిట్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తండ్రిని కోల్పోయిన కుటుంబాలకు దాతల సహకారంతో ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఏడాదిగా ఆడపిల్లల పెళ్లికి కానుకలు అందిస్తున్నారు.

క్రీడల్లో చిరుత.. చికిత



ఆర్చరీలో విల్లు ఎక్కుపెట్టిన చికిత

కరీంనగర్‌స్పోర్ట్స్: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన టి.చికిత విలువిద్య(ఆర్చరీ)లో అంతర్జాతీయస్థాయిలో రాణిస్తోంది. చిన్న వయస్సులోనే వరల్డ్‌కప్‌లో పాల్గొంటూ పతకాల పంట పండిస్తోంది. ప్రస్తుతం పంజాబ్‌లోని సోనీపట్‌లో శిక్షణ పొందుతోంది.చికిత తండ్రి శ్రీనివాస్‌రావు రైతు. తల్లి శ్రీలత గృహిణి. మార్చి తొలివారంలో బ్యాంకాక్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో కాంస్యం సాధించింది. ఏప్రిల్‌లో ఫ్లోరిడాలో జరగనున్న వరల్డ్‌కప్ స్టేజ్–1, మేలో చైనాలో జరిగే వరల్డ్ కప్ స్టేజ్– 2 పోటీలకు సిద్ధమవుతోంది. ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకం సాధిస్తానని చెబుతోంది.

ఆ నలుగురు.. 'సిరి' వెలుగులు



సిరిసిల్లలో ఆత్మవిశ్వాసం నింపిన లత, శ్రీమతి, అన్నపూర్ణ, ఉమ

సిరిసిల్ల: సిరిసిల్ల కార్మికవాడల్లో ఏ గడప తట్టినా.. కష్టాలు, కన్నీళ్లు. 2008లో వరుస ఆత్మహత్యలతో కార్మికక్షేత్రం తల్లడిల్లింది. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అప్పటి ఉమ్మడి కరీంనగర్ కలెక్టర్ సందీప్‌కుమార్ సుల్తానియా సిరిసిల్లలో ఉండే విధంగా ఆదేశించారు. ఆత్మహత్యలు ఆగాలని స్పష్టం చేశారు. ఆర్డీవో ఆఫీస్‌లోనే మకాం వేసిన కలెక్టర్ ఆత్మహత్యలకు కారణాలను అన్వేషించారు. పేదరికం, పనిఒత్తిడి, మానసికవేదన, అప్పులేనని నిర్ధారించారు. వారిలో ధైర్యం నింపేందుకు ఓ నలుగురు మహిళలను నియమించారు. వారు క్షేత్రస్థాయిలో ఇల్లిల్లు తిరుగుతూ బాధల్లో ఉన్న కార్మికులకు భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. ఆ నలుగురే రాపెల్లి లత, బూర శ్రీమతి, వేముల అన్నపూర్ణ, కొండ ఉమ. వీరిని చేనేత జౌళిశాఖ ద్వారా నియమించారు. నిత్యం కార్మికవాడల్లో తిరుగుతూ కౌన్సెలింగ్ నిర్వహించారు. 16 ఏళ్లుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో పనిచేసేవారికి ఆ నలుగురు అండగా నిలిచారు. కార్మికవాడలైన బీ.వై.నగర్, సుందరయ్యనగర్, తారకరామనగర్, ఇందిరానగర్, పద్మనగర్, గణేష్‌నగర్, నెహ్రూనగర్, శాంతినగర్, ప్రగతినగర్‌లోని కార్మికుల ఇళ్లకు వెళ్తూ వారి కష్టసుఖాలు తెలుసుకోవడవం, కౌన్సిలింగ్‌కు ఏర్పాట్లు చేయడం వీరివిధి. సైకాలజిస్ట్ పున్నంచందర్‌తో కలిసి మనోవికాసాన్ని కలిగించేందుకు అనేక సదస్సులు నిర్వహించారు. అర్హులైన నేతకార్మికులకు అంత్యోదయ కార్డులు, పెన్షన్లు, రేషన్ కార్డులు, నేతన్నలకు బీమా పథకాలను ఇప్పించడం, వైద్యం చేయించడం వంటి సామాజిక సేవలో ఆ నలుగురు ముందుకు సాగుతున్నారు.

స్నేక్.. షేక్



కొండచిలువతో సయిదా

కరీంనగర్‌రూరల్: సాధారణంగా మహిళలు బల్లి కనిపిస్తేనే అమ్మో అంటారు. అయితే ఇందుకు భిన్నంగా ఓ మహిళ ఎలాంటి భయం లేకుండా పాములు పట్టడమే వృత్తిగా ఎంచుకుంది. కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని చంద్రపురికాలనీకి చెందిన షేక్ సయిదా భర్త ఖాజామియా 15ఏళ్లక్రితం డెంగీతో చనిపోయాడు. కుటుంబపోషణ కోసం పాములు పడుతోంది. చిన్నప్పుడు తండ్రి సయ్యద్‌బాబా వద్ద నేర్చుకున్న పాములను పట్టడమే వృత్తిగా మార్చుకుంది. తమ ప్రాంతంలో పాము వచ్చిందని ఎవరైనా ఫోన్‌చేస్తే రాత్రి పగలు లేకుండా అక్కడికి చేరుకుంటోంది. పాములు పట్టినందుకు వారు ఇచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. పట్టుకున్న పాములను అటవీ శాఖ అధికారులకు అప్పగించడం, లేదా అటవీప్రాంతంలో విడిచిపెట్టడం చేస్తోంది. సయిదా ప్రస్తుతం అద్దెఇంట్లో ఉంటోంది. పాముకాటుకు గురైతే తన కుటుంబ పరిస్థితి ఏంటని ఆవేదనవ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం ఆదుకునేందుకు సాయం చేయాలని కోరుతోంది.

అన్ని రంగాల్లో ముందున్నారు



పెద్దపల్లిరూరల్: సమాజంలో వేగంగా వస్తున్న మార్పులకు తగ్గట్టు సాంకేతిక రంగంలోనూ ప్రతిభ, నైపుణ్యాలతో ముందుంటున్నారు. వాస్తవానికి పురుషులకంటే మహిళల్లోనే మానసిక స్థైర్యం ఎక్కువ. పాతికేళ్ల పాటు పుట్టింట్లో ఉండి, పెళ్లి తర్వాత మెట్టినింట్లో తనకు అంతగా పరిచయం లేనివారి నడుమ ధైర్యంగా జీవించగలుగుతుంది. చదువులో రాణిస్తున్న మహిళలకు న్యాయవ్యవస్థలో ఉద్యోగాలు కల్పించడంలో ప్రాధాన్యత ఉంటుంది. ప్రస్తుత కాలంలో ఆర్థికావసరాలు పెరిగిపోయాయి. ఇటీవలి కాలంలో పెళ్లి అయిన కొన్నాళ్లకే విడాకుల వరకు వస్తున్నాయి. మానసిక ఒత్తిళ్లకు లోనై కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తెచ్చేందుకు యత్నిస్తున్నాం.

– కె.స్వప్నరాణి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, పెద్దపల్లి

బొగ్గుగనిలో స్త్రీ శక్తి



మోటార్ వైండింగ్ చేస్తున్న సింగరేణి మహిళా కార్మికులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణికి స్త్రీ శక్తి తోడైంది. ఇప్పటివరకు పురుష రంగానికే పరిమితమైన సింగరేణి మైనింగ్‌లో మహిళలు అడుగిడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత వారసత్వ ఉద్యోగాల పునరుద్ధరణతో మహిళలకు సింగరేణి ఉపాధి అవకాశాలను మరింత పెంచింది. కేవలం కార్యాలయాల్లోనే కాకుండా భూగర్భ గనుల్లో పనిచేసే ఇంజినీర్లు, అండర్ మేనేజర్లుగా పెద్ద సంఖ్యలో మహిళలు చేరారు. ప్రస్తుతం సంస్థలో 201 మంది అధికారిణులుగా 1,794 మంది మహిళా ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. మహిళలకు ప్రత్యేకంగా రెండు గనులు ఏర్పాటు చేయాలని యాజమాన్యం భావిస్తోంది. సంస్థలో తొలి మహిళా రెస్క్యూ బ్రిగేడియర్‌గా కొత్తగూడెం పీవీకే –5గనికి చెందిన అండర్‌మేనేజర్ అంబటి మౌనిక ఎంపికైంది. ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ జీఎంగా సింగరేణి చరిత్రలోనే తొలిసారి మహిళా అధికారి కవితనాయుడు సమర్థవంతంగా రాణిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్మెంట్– సీఎస్పార్ జీఎంగా తొలిసారి మరో మహిళా నికోలస్ బెనడిక్ట్, సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించే కంపెనీ సెక్రటరీగా సునీతాదేవి, న్యాయ విభాగం బాధ్యతలను డిప్యూటీ జీఎం హోదాలో శిరీషరెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ సుజాత విధులు నిర్వర్తిస్తున్నారు.

ఫాస్ట్‌బౌలర్.. శ్రీవల్లి



తల్లితో శ్రీవల్లిరెడ్డి

ఇల్లంతకుంట/కరీంనగర్ స్పోర్ట్స్: చిన్ననాటి నుంచి క్రికెట్‌పై మక్కువ పెంచుకొని జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతోంది కట్ట శ్రీవల్లిరెడ్డి. ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామానికి చెందిన కట్ట లక్ష్మారెడ్డి– ఉమ దంపతుల చిన్న కూతురు శ్రీవల్లిరెడ్డి మూడో తరగతి నుంచి క్రికెట్‌పై ఆసక్తి పెంచుకుంది. కూతురు ఇష్టం మేరకు లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లో ప్రత్యేక కోచింగ్ ఇప్పించగా, పాస్ట్ బౌలింగ్‌లో మెలకువలు నేర్చుకుంది. 2019లో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి పాఠశాల క్రీడా ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. 2022లో పూణెలో నిర్వహించిన అండర్–19 బాలికల క్రికెట్ పోటీల్లో హెచ్‌సీఏ తరఫున పాల్గొంది. ఈ జనవరిలో త్రివేండ్రంలో నిర్వహించిన బీసీసీఐ ఉమెన్స్ అండర్–19 వన్డే ట్రోఫీలో, 2024 డిసెంబర్‌లో అహ్మదాబాద్‌లో నిర్వహించిన సీనియర్ ఉమెన్ వన్డే టోర్నీలో హైదరాబాద్ తరఫున ప్రాతినిధ్యం వహించింది. కాగా.. శ్రీవల్లి కోసం తన తండ్రి ఊరు వదిలి కరీంనగర్, హైదరాబాద్‌లో ఉంటున్నారు.

ఐపీఎస్‌ల బదిలీలు

- రామగుండం సీపీగా అంబర్ కిశోర్ ఝా
- కరీంనగర్ సీపీగా గౌస్ ఆలం
- సిరిసిల్ల ఎస్పీగా గిటే మహేశ్



గౌస్ ఆలం అంబర్ కిశోర్‌ఝా గిటే మహేశ్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు ఐపీఎస్‌లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా అంబర్‌కిశోర్ ఝాను నియమించింది. రామగుండం సీపీగా పనిచేస్తున్న శ్రీనివాసులును సీఐడీ ఐజీగా బదిలీచేశారు. కరీంనగర్ సీపీగా గౌస్ ఆలంను నియమించగా, ఇక్కడ పనిచేస్తున్న అభిషేక్ మహంతిని తెలంగాణ క్యాడర్ నుంచి రిలీవ్ చేశారు. సిరిసిల్ల ఎస్పీగా మహేశ్‌బాబాసాహెబ్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న అఖిల్‌మహాజన్‌ను ఆదిలాబాద్ ఎస్పీగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న పెద్దపల్లి డీసీపీగా పి.కరుణాకర్‌ను నియమించారు. పెద్దపల్లి డీసీపీగా పనిచేస్తున్న చేతన హైదరాబాద్‌లోని ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీఅయ్యారు.

అంబర్ కిశోర్ ఝా

2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అంబర్ కిశోర్ ఝా 2011లో మొదటగా ఉమ్మడి ఆదిలాబాద్ ఏఎస్పీగాను 2012 వరంగల్ ఓఎస్డీ, అదనపు ఎస్పీగా పనిచేయడంతో పాటు 2014లో వరంగల్ ఎస్పీగా పనిచేశారు. తెలంగాణ ఏర్పాటు ఆవిర్భావం తర్వాత భద్రాద్రి కొత్తగూడెం తొలి ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2018లో హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా, ఇదే సంవత్సరంలో కేంద్ర సర్వీసుల్లో విధులు నిర్వహించారు. 2013 అక్టోబరులో వరంగల్ కమిషనర్‌గా పనిచేశారు.

గౌస్ ఆలం..

2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఇప్పుడు కరీంనగర్ సీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ములుగు ఎస్పీగా పనిచేశారు. అంతకుముందు అక్కడే ఓఎస్‌డీగా విధులు నిర్వర్తించారు. కాగా.. అంతకుముందు ఏటూరునాగారంలో అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఈయన బిహార్ రాష్ట్రంలోని గయాకు చెందినవారు. ఐఐటీ ముంబాయ్‌లో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు.

గిటే మహేశ్

2020 బ్యాచ్‌కు చెందిన గిటే మహేశ్ అహ్మదాబాద్ వాసి. తల్లిదండ్రులు కౌలు రైతులు. అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ అయిన మహేశ్‌ది పేద కుటుంబమైనా.. కష్టపడి చదివి.. ఐపీఎస్ సాధించారు. తెలంగాణకు కేడర్‌కు కేటాయించాక.. కరీంనగర్‌లో ట్రైనీగా విధులు నిర్వహించారు. చొప్పదండి ఎస్‌హెచ్‌వోగా ఆరునెలలపాటు పనిచేశారు. ప్రస్తుతం ములుగు ఓఎస్డీగా ఈయనకు సిరిసిల్ల ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.

నిరుద్యోగుల ఉపాధికి కార్యాచరణ

- ఎల్ఆర్ఎస్‌ను ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్కిల్ కమిటీ సమావేశం జరిగింది. నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా 16 మంది జిల్లా స్థాయి అధికారులతో కూడిన జిల్లా స్థాయి స్కిల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవన నిర్మాణం, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అవకాశాలను జిల్లా యువతకు వివరిస్తూ ఉపాధి కల్పనకు ప్రణాళికతో ముందుకుసాగాలన్నారు.

పెన్షన్లు రుణాలకు జమచేస్తే క్రిమినల్ కేసు

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ సామాజిక పింఛన్లను కొన్ని బ్యాంకులు రుణాల కింద జమ చేసుకుంటున్నట్లు తెలిసిందని, పెన్షన్లను రుణాల కిందికి జమ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రూ.1,519కోట్లు పంట రుణాలు లక్ష్యం కాగా.. డిసెంబరు నాటికి రూ.808కోట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఈనెలాఖరిలోగా పరిష్కరించాలని సూచించారు. 42,942 దరఖాస్తులు 2020లో రాగా 23,515 ఆమోదించామని, 1,230 తిరస్కరించినట్లు తెలిపారు. అధికారుల బృందం దరఖాస్తులు పరిశీలించి అర్హత ఉన్న వాటిని పరిష్కరించాలన్నారు. సమావేశాల్లో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, డీఆర్‌డీవో శేషాద్రి, పరిశ్రమలశాఖ జీఎం హన్మంతు, డీఏవో అఫ్జల్ బేగం, ఎల్‌డీఎం మల్లికార్జున్, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు జనార్దన్, రాజమనోహర్, లీడ్ బ్యాంకు మేనేజర్ టీఎస్ మల్లికార్జున్‌రావు, యూబీఐ రీజినల్ హెడ్ అపర్ణరెడ్డి, ఆర్‌బీఐ ఎల్‌డీవోవీ సాయితేజ్‌రెడ్డి, డీటీసీపీ అన్సార్, కమిషనర్లు సమ్మయ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

వనిత.. అన్నింటా ఘనత



క్లుప్తంగా

ఎన్‌ఆర్‌ఐల సేవలు మరువలేనివి



ముస్తాబాద్(సిరిసిల్ల): పురిటిగడ్డ రుణం తీర్చు కునేందుకు ప్రవాస భారతీయులు చేస్తున్న సేవ లు మరువలేనివని ఐఎంఏ జిల్లా మాజీ అధ్య క్షుడు, ప్రముఖ వైద్యులు చింతోజు శంకర్ కొనియాడారు. ముస్తాబాద్ అయ్యప్ప ఆల యంలో కల్వకుంట్ల రమాదేవి జ్ఞాపకార్థం అమె రికా ఫిజీషియన్ డాక్టర్ లక్ష్మణ్‌రావు ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని శుక్ర వారం ప్రారంభించారు. డాక్టర్ చింతోజు శంకర్ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడ్డ శ్రీగాథ వ్యాస్తవ్యులు డాక్టర్ లక్ష్మణ్‌రావు పురిటిగడ్డలో మద్రాస్‌కు చెందిన శంకర నేత్రాలయ సౌజన్యంతో ఆధునిక కంటి వైద్యశిబిరం నిర్వ హించడం అభినందనీయమన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి వెంటనే ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వారం రోజులపాటు సాగే ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎస్సై గణేశ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్ రావు, బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అం జాగౌడ్, కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్య క్షుడు తోట ధర్మేందర్, మాజీ సర్పంచ్ సడిమెల ఎల్లం, రాజుగురుస్వామి పాల్గొన్నారు.

టీబీ నివారణ లక్ష్యం చేరుకోవాలి



బోయినపల్లి(చొప్పదండి): అసంక్రమిత వ్యాధు లు, టీబీ నివారణ లక్ష్యం చేరుకునేందుకు వైద్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి అనిత, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని అనం తపల్లిని జిల్లా వైద్యాధికారుల బృందం శుక్ర వారం సందర్శించింది. వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా గ్రామంలో టీబీ వ్యాధిగ్రస్తులు లేరన్నారు. పరీక్షలకు పంపించిన తెమడ శాం పిల్స్ నెగెటివ్ వచ్చాయని తెలిపారు. టీబీ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. బోయిన పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్, టీబీ కోఆర్డినే టర్ బిగేందర్, సూపర్‌వైజర్ శశి, పంచాయతీ కార్యదర్శి అనిల్, ఎస్‌టీఎస్ గంగాధర్, ఏఎన్ ఎం వసంత, ఆశకార్యకర్త లత ఉన్నారు.

ఊరిపై మమకారం.. సేవకు శ్రీకారం



శిక్షణ పొందుతున్న మహిళలతో శారద

రామగిరి(మంథని): ఊరిపై మమ కారంతో సామాజిక సేవకు శ్రీకారం చుట్టారు రేండ్ల శారద. మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన శారద వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. అదే గ్రామానికి చెందిన రేండ్ల కుమార్ స్వామితో వివాహం జరిగింది. మహి ళల నిరుద్యోగ సమస్య, ఆర్థిక ఇబ్బం దులను చూసి సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని భర్త సహకారంతో ఆర్‌ఎస్‌కే ఆపన్న హస్తం ఏర్పాటు చేశారు. దాని ద్వారా గ్రామంలోని మహిళలకు ఉచితంగా పరిక రాలు అందించారు. మహిళలకు కుట్లు–అల్లికలు, బ్యూటీషియన్, కుట్టు మిషన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. న్యాక్ సంస్థ ద్వారా సొంత ఖర్చులతో సర్టిఫికెట్స్‌ను అం దించారు. ఒక్కో విడతలో సుమారు 40 మందికి మూడు నెలల పాటు శిక్షణ అందిస్తు న్నారు. 'ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లు పూర్తి చేశాం. ప్రస్తుతం ఐదో బ్యాచ్ కొనసాగు తుంది. నా భర్త సహకారంతో సేవ చేయడం తృప్తిగా ఉంది'.అని శారద వెల్లడించారు.

చిన్న హోటల్.. పెద్ద బాధ్యత



అటుకులు పొట్లం కడుతున్న సుశీల

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌ప ల్లి మండలం ఆత్మనగర్‌కు చెందిన బట్టు సుశీల చిన్న హోటల్ నడిపి స్తూ తన కుమారుల్ని ఉన్నతు లుగా తీర్చిదిద్దింది. సుశీల, భర్త గంగరాజు గ్రామంలో హోటల్ నడిపించేవారు. 16 ఏళ్ల క్రితం గం గరాజు గుండెపోటుతో మృతిచెం దాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. అతడు చనిపో యిన సమయంలో పిల్లలంతా చిన్నవారే. అప్పటి నుంచి సుశీల నలుగురు పిల్లల బాధ్యతను మోసింది. ప్రస్తుతం పెద్దకుమారుడు సుమన్ ఆర్మీలో పనిచేస్తుండగా, చిన్న కొడుకు రం జిత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల వివాహం చేసింది.

ఇన్‌స్టాగ్రామ్ అశ్విని



ఠాకూర్ అశ్విని అలియాస్ ఆశా

విద్యానగర్(కరీంనగర్): ఠాకూర్ అశ్విని అలియస్ ఆశాది కరీంనగర్‌లోని భగత్‌నగర్. నగరంలోని డైలీ మార్కెట్, వేంకటేశ్వరస్వామి గుడి వద్ద ఫుట్‌పాత్‌పై సీజనల్ వ్యాపారం చేస్తుంది. మట్టికుండలు, దీపాల ప్రమిదలు, రంగుల ముగ్గులు, పచ్చడి జాడీలు, దీపాల వత్తులు అమ్ముతుంది. రెండేళ్ల క్రితం వ్యాపార అభివృద్ధి కోసం తొలిసారిగా ఆమె అమ్మే వస్తువుల గురించి రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా వేల సంఖ్యలో వ్యూస్ వచ్చాయి. దీంతో మరిన్ని రీల్స్ చేసి పోస్ట్ చేసింది. వాటికి కూడా ఆశించిన దానికన్నా ఎక్కువగా స్పందన రావడంతో సినిమా పాటలు, జానపద గేయాలు, భక్తి, రొమాం టిక్, ప్రేమ, ఎడబాటు తదితర అంశాలపై రీల్స్ చేయడం మొదలు పెట్టగా వాటికి కూడా లక్షల్లో వ్యూస్ రావడం, ఆరో తరగతి వరకే చదివిన ఆశాకు భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తోడవడంతో రీల్స్‌పై మక్కువ పెంచుకుంది. రెండేళ్లలో 600 వరకు రీల్స్ చేసింది. 'ఇన్‌స్టాగ్రామ్‌లో నా రీల్స్ చూసిన డైరెక్టర్లు చాలా మంది వారి సినిమాల్లో అడిగారు. కీ రోల్ పాత్రలు వస్తే తప్పకుండా చిన్న, పెద్ద సినిమాల్లో చేస్తాను' అని ఠాకూర్ అశ్విని వెల్లడించింది.

బాధితులకు అండగా 'పోలీస్ అక్క'



పోలీస్ అక్క కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్(ఫైల్)

సిరిసిల్లక్రైం: మహిళలు, విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు రాష్ట్రం లో ఎక్కడాలేని విధం గా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ అధికారు లు పోలీస్ అక్క పేరిట జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళా కానిస్టేబుల్‌ను కేటాయించారు. 2024 డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మహిళలను మమేకం చేస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. వేధింపులకు గురైతే బాధితులు ఇంట్లో మనిషి మాదిరిగా పోలీస్ అక్కకు చెప్పుకునేలా విధివిధానాలు ఖరారు చేశారు. పోలీస్ అక్క కార్యక్రమం ప్రారంభించిన ప్పటి నుంచి దాదాపు 220 అవగాహన కార్యక్రమాలను నిర్వహించిన పోలీసులు నాలుగు ఫిర్యాదులు స్వీకరించారు. అందులో మూడు ఈ–పెట్టి కేసులు ఒక ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు అధికారిక గణంకాలు ఉన్నాయి.

పురుషులకు దీటుగా..



తల్లిదండ్రులతో స్నిగ్ధ, స్నిగ్ధ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీకి చెందిన పింగిళి కృష్ణారెడ్డి–స్వర్ణలత దంప తులకు ఇద్దరు కూతుర్లు. కృష్ణారెడ్డి జేఎన్‌టీయూ కళాశాలలో ఫిజికల్ డైరె క్టర్. ఆడపిల్లలనే భావనలేకుండా తన కూతుళ్లను పురుషులు దీటుగా చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దారు. పెద్ద కూతు రు స్నిగ్ధ స్థానికంగా 10వ తరగతి, ఇంటర్, హైదరాబాద్‌లో బీటెక్(మెకానికల్) పూర్తి చేసింది. అమెరికాలో ఎమ్మెస్సీ చేసి ప్రస్తుతం హెచ్1బీ వీసా మీద సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. చిన్న కూతురు స్నిగ్ధ స్థానికంగా పది, ఇం టర్, ఫామ్ డీ పూర్తి చేసి డాక్టర్ పట్టా పొందింది. అమెరికాలో ఎమ్మెస్సీ చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది.

ఎములాడ రాజన్న సేవలో..



హుండీ లెక్కింపులో సేవలందిస్తున్న వివిధ జిల్లాలకు చెందిన మహిళలు

వేములవాడ: దైవకార్యంలో మేము సైతం అం టూ మహిళలు ముందుకు సాగుతున్నారు. సొం త ఖర్చులతో వేములవాడకు చేరుకుని హుండీ లెక్కింపులో, భక్తుల సేవలో తరిస్తున్నారు. ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు సొంత ఖర్చులతో రాజన్న సన్నిధికి చేరుకుని సేవలందిస్తున్నారు. ఇందులో ప్రధానంగా శ్రీలలితా సేవా ట్రస్టు, శివరామకృష్ణ భజన మండలి, శ్రీరాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు దశాబ్దానికిపైగా రాజన్న సేవలో తరిస్తు న్నారు. ప్రతీసారి జరిగే హుండీ లెక్కింపుతో పాటు అన్ని పర్వదినాలు, రద్దీ రోజుల్లోనూ వీరు స్వచ్ఛం దంగా సేవలందిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు పొరుగు జిల్లాల నుంచి వందల సం ఖ్యలో సేవా సమితి సభ్యులు వస్తుంటారు. గురువారం నాటి హుండీ కౌంటింగ్‌లో సుమారు 550మం ది మహిళలు పాల్గొన్నారు. 'మహిళలు ఆలయంలో అందిస్తున్న సేవలు అమూల్యమైనవి. వారి సేవ లకు కృతజ్ఞతగా మధ్యాహ్న భోజనం, రెండు లడ్డూలు, స్వామి వారి దర్శనం కల్పిస్తున్నాం'. అని ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగుల బోయినపల్లి

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలంలో మహిళా అధికారులు, ఉద్యోగులు అధికంగా ఉన్నారు. రెవెన్యూ, మండల పరిషత్, ఐకేపీ, ఉపా ధిహామీ, వైద్య, వ్యవసాయ శాఖల్లో కొలువు దీరారు. ఎంపీడీఓగా భీమ జయశీల, డెప్యూటీ తహసీల్దార్‌గా దివ్యజ్యోతి, మండల వ్యవసాయ అధికారిగా కె.ప్రణీత, ఈజీఎస్ ఏపీవోగా వనం సబిత, ఐకేపీ ఏపీఎంగా జయసుధ, విలాసాగర్, కొదురుపాక పీహెచ్‌సీల్లో వైద్యులుగా అనిత, రేణు ప్రియాంక.. ఇలా పలు విభాగాల్లో మహిళలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

అంకిత భావంతో విధులు



పంచాయతీరాజ్ శాఖలో వీడీవో, పంచాయతీ కార్య దర్శి, ఈఓపీఆర్డీగా పని చేసి ఇప్పుడు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నా. వివిధ మండలాల్లో ప్రజల తో మమేకమై అనేక అభివృద్ధి పనుల్లో పాలు పంచు కోవడం ఎంతో సంతృప్తినిచ్చింది.

– భీమా జయశీల, ఎంపీడీవో, బోయినపల్లి

వ్యవసాయంపై మక్కువ



వ్యవసాయ అధికారిగా అనేక మండలాల్లో రైతులకు ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చిన. పని చేసిన ప్రతీ చోట క్షేత్రస్థాయిలో పంట పొలాలు సందర్శించి రైతుల సాధక బాధకలు గుర్తించడం సంతృప్తినిస్తోంది.

– కె.ప్రణీత, ఎంఏవో, బోయినపల్లి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



శేషాద్రినిరెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

సిరిసిల్లటౌన్: పురుషులకు ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వేము లవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మహిళల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. అనంతరం కేక్ కోసి సంబరాలు జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, డాక్టర్ తడక రవళి, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, ఎక్స్ ఎంపీపీ సంకినేని లక్ష్మి, మాధవి, జయశ్రీ, భవిత, లావణ్య, సుస్మిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్ర భుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్రం విద్యా ర్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్ర తిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. విద్యార్థులు జాషువ, విష్ణు, గంగసాయి, అక్షయ్, విన య్‌లు 'ఇంపాక్ట్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఆన్ బయింగ్ బిహేవియర్ ఆర్ కన్స్యూమర్ ఎ స్టడీ ఇన్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై రూపొందించిన స్టడీ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు శకుంతల, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, కృష్ణప్రసాద్, శోభారాణి, శ్రీధర్‌రావు అభినందించారు.

నేడు మహిళా సమాఖ్యలకు బస్సులు



మండల సమాఖ్యలకు ఇచ్చే బస్సులు ఇవే..

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు కార్యరూపం దాల్చనున్నాయి. మహి ళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు కేటాయించడం ద్వారా వారిని ఆర్థికంగా పరిపుష్టం చేయాలన్న లక్ష్యాన్ని నెరవే ర్చేందుకు అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 20 మండల మహిళా సమాఖ్యలను ఎంపిక చేశారు. ఈ జాబితాలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఐదు మం డల మహిళా సమాఖ్యలకు అవకాశం దక్కడం గమనార్హం. శనివారం రవాణామంత్రి పొన్నం ప్రభాకర్, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో సమాఖ్యలకు బస్సులు కేటాయిం చనున్నారు.

ఎన్‌ఆర్‌ఎల్‌ఎం సాయంతో..

నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్‌ఆర్‌ఎల్ ఎం) పథకంలో భాగంగా కేంద్రం మహిళా సమాఖ్యలకు ఆర్థిక సాయం చేయనుంది. ఈ మేరకు రూ.30 లక్షలు ఈ పథకం ద్వారా, మహి ళా సమాఖ్య నిధుల నుంచి మరో రూ.6 లక్షలు కలిపి మొత్తం రూ.36 లక్షలు వెచ్చించి ఆర్టీసీ (ప ల్లెవెలుగు) బస్సులు కొంటారు. ఈ బస్సుల ఆర్సీ బుక్‌లో మహిళా సమాఖ్య పేరుమీదే రిజిస్ట్రేషన్ చూపిస్తారు. వీటి నిర్వహణ ఆర్టీసీ చూసుకుంటుంది. నెలనెలా రూ.77,220 చొప్పున ఆయా సమాఖ్యలకు ఆర్టీసీ చెల్లిస్తుంది.

ఎంపికైన సంఘాలివే..

వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా 150 మండల మహి ళా సమాఖ్యలకు ప్రభుత్వం బస్సులు ఇచ్చేం దుకు ఎంపిక చేసింది. అందులో పెద్దపల్లి జిల్లా లో 9, రాజన్నసిరిసిల్లకు 9, కరీంనగర్ 14, జగిత్యాల 15 సమాఖ్యలు ఉన్నాయి. ఇందులో శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం శ్రీచైతన్య సమాఖ్య, కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఉదయలక్ష్మి సమాఖ్య, సైదాపూర్ మండలం సంతోషిమాతా సమాఖ్య, పెద్దపల్లి జిల్లా ముత్తారానికి చెందిన రుద్రమ సమాఖ్య, రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన అభ్యుదయ సమాఖ్యలు మంత్రుల చేతుల మీదుగా కొత్త బస్సులు అందుకోనున్నాయి.

స్కానింగ్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



సిరిసిల్ల: స్కానింగ్ సెంటర్లలో చేసే స్కానింగ్‌ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రోగ్రాం ఆఫీసర్, హెచ్‌ఎస్ ఇన్‌చార్జి సంపత్‌కు మార్ కోరారు. కుటుంబ ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలతో సిరిసిల్లలోని పలు స్కానింగ్ సెంట ర్లను శుక్రవారం తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం(పీసీపీఎన్‌డీటీ) ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ స్కానింగ్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయడంతోపాటు ఆన్‌లైన్ లోనూ నమోదు చేయాలన్నారు. డిప్యూటీ డెమో డాక్టర్ రాజ్‌కుమార్, డీహెచ్‌ఈడబ్ల్యూ రోజా, పోలీస్ కానిస్టేబుల్ శ్రీలత, హెచ్‌ఈ బాలయ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ మహేశ్ పాల్గొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు



ధర్నా చేస్తున్న రైతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల కేంద్రంలోని సింగసముద్రం నాలా(పెద్ద కాలువ) ఆయకట్టు భూములకు సాగునీరందించాలని డిమాండ్ చేస్తూ రైతులు, నాయకులు శుక్రవారం రోడ్డెక్కారు. సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహ దారిపై బైఠాయించారు. దాదాపు వెయ్యి ఎకరాలకు సాగునీరందక పొలాలు ఎండిపోతున్నాయని, పశు వులకు తాగునీరు కూడా అందడం లేదని రైతులు వాపోయారు. నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు ద్వారా పెద్ద కాలువకు నీరు విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని కోరారు. వీరి ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఎస్సై శ్రీకాం త్ రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఆఫీస్ సబార్డినేట్ సస్పెన్షన్

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని గాలిపెల్లి పశువైద్య కేంద్రం ఆఫీస్ సబార్డినేట్ కె.దే వమ్మను శుక్రవారం సస్పెండ్ చేస్తూ జిల్లా పశువై ద్యాధికారి రవీందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దేవమ్మ గతేడాది జూన్‌లో ముందస్తు రిటైర్మెంట్ కోసం మెడికల్ సర్టిఫికెట్లతో జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నట్టు మెడికల్ సర్టిఫికెట్లు జతపరిచింది. దీనిపై జిల్లా అధికారులు విచారించ గా దేవమ్మ దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్స్ మోస పూరితమైనవని తేలింది. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పశువైద్యాధికారి దేవమ్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన నలుగురి రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన నలుగురిని జిల్లా పోలీసు లకు కటకటాల్లోకి నెట్టారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై రమాకాం త్ తెలిపిన వివరాలు. కరీంనగర్‌కు చెందిన జడ కొమురయ్య మండలంలోని రాచర్లగొల్లపల్లి పశువైద్యశాలలో లైవ్‌స్టాక్ అధికారిగా పనిచేస్తున్నాడు. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని మెడికల్ ఇన్‌వాల్యుయేషన్ కోసం కలె క్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. కలెక్టర్ వెరిఫికేషన్ చేయించగా, నకిలీపత్రాలు సమర్పించినట్లు తేలింది. మండల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జంపాల రాహుల్ ఫిర్యాదుతో కేసు విచారణ చేపట్టారు. మెడికల్ ఇన్‌వాల్యుయేషన్ ద్వారా తన కొడుకుకు ఉద్యోగం ఇప్పించాలనే ఉద్దేశ్యంతో కొమురయ్య దర ఖాస్తు చేసుకున్నాడు. కరీంనగర్‌కు చెందిన రిటైర్డ్ తహసీల్దార్ బీరయ్యను సం ప్రదించాడు. అతను రూ.3లక్షలు తీసుకొని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మహ్మద్ బాసిద్ హుస్సేన్‌ను పరిచయం చేశాడు. అతని ద్వారా కరీంనగర్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ కొత్తపల్లి రాజేశంను కలిశాడు. రాజేశం తన ల్యాబ్ లో సన్‌షైన్ హాస్పిటల్‌కు సంబంధించిన ప్రిస్క్రిప్షన్లపై తప్పుడు ధ్రువీకరణప త్రాలు, నకిలీ వైద్యుల స్టాంప్‌లు వేసి, సంతకాలు ఫోర్జరీ చేసి సర్టిఫికెట్లు సృష్టిం చారు. వీటిని కొమురయ్య దరఖాస్తు చేసుకోగా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసిన విషయం నిర్ధారణ అయింది. పోలీసులు వీరిని అరెస్టు చేశారు.

పులిసంచారంతో భయాందోళన

వేములవాడరూరల్: ఫాజుల్‌నగర్ ఫారెస్టు ప్రాంతంలో పులి సంచరిస్తున్న ఆన వాళ్లు బయటపడ్డాయి. ఫాజుల్‌నగర్ శివారులో ఓ గేదెపై దాడిచేసిన ఆనవాళ్లు, పాదముద్రలు రైతులకు కనిపించాయి. ఫారెస్టు అధికారులు ఈ ప్రాంతంలో గాలిస్తున్నా ఆనవాళ్లు గుర్తించలేదు. రెండు రోజుల క్రితం ఉప్పరి నారాయణ అనే రైతు గేదెపై దాడిచేయడం, దాని పాదముద్రలు బయటపడడంతో పులి తిరుగుతున్నట్లు రైతులు గుర్తించారు. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లేం దుకు భయపడుతున్నారు. ఫారెస్టు అధికారులు పులి తిరుగుతున్నట్లు ప్రకటన చేయకపోవడంతో ఫాజుల్‌నగర్, నూకలమర్రి, నమిలిగుండుపల్లి, వట్టెంల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎఫ్‌ఆర్‌వో ఖలీలొద్దీన్‌ను వివరణ కోరగా పూర్తి సమాచారం రేపటి వరకు చెబుతామని దాటవేశారు.